కొత్తకోణం:

# మనసు చేతలు

కాలం మారింది. సామాజిక స్థితిగతులూ మారాయి. మనుమల్లోనూ, వారి మనస్తత్వాల్లోనూ, ఇతరత్రా ఎన్నో అంశాలలో ఎంతో మార్పువచ్చింది. కాని, పిల్లల పెంపకంలో మాత్రం తల్లిదండ్రులు కాలానుగుణంగా మార్పుని ఆహ్వానించ లేక పోవడం జరుగుతోంది. ఈ కాలం పిల్లల్లో వయసుకి మించినతెలివితేటలు వుండడం మనం చూస్తూనే వున్నాం. ఆ కారణంగా వారికి స్వేచ్ఛ ఇస్తే లేనిపోని దురలవాట్లకు లోనై ఎక్కడ చెడిపోతారో నన్న భయంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని అదుపులో వుంచుకోవడం కోసం గట్టి కట్టుబాట్లు చెయ్యడం, కఠినమైన ఆంక్షలు విధించడం తెలియనిదికాదు. అయితే ఈ విధంగా తమ పిల్లలభవిష్యత్తుకోసం విధించే కఠినమైన క్రమశిక్షణా విధానాలు పిల్లలకు ప్రాణసంకటంగా పరిణమించి, ఇల్లు ఒకజైలులా అనిపించి స్వేచ్ఛా జీవితం పట్ల ఆసక్తి పెంచుకుని అవకాశం దొరికితే చాలు విచ్చలవిడిగా ప్రవర్తించ డానికి ప్రయత్నిస్తూంటారు. 'పిల్లలపట్ల అతిగారాబం చూపించడం ఎంత ప్రమాదకరమో, కఠినంగా ప్రవర్తించడమూ అంతే ప్రమాదకరం' - అని గ్రహించలేని తల్లిదండ్రుల పిల్లల్లో తాము తమ తల్లిదండ్రుల ప్రేమను పొందలేకపోతున్నామే!' అన్న బాధతో తల్లిదండ్రులపై ద్వేషాన్ని పెంచుకుని, వారి పట్ల ఏ విధంగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు! వారి భవిష్యత్తు ఏవిధంగా నాశనమౌతోంది!

దానికి తమకు తెలియకుండానే తల్లిదండ్రులు ఎలా కారణభూతమౌతున్నారు? అనే ప్రశ్నలకి ఓ గోపాల్ కథే సమాధానం.

"గోపాల్! నువ్విప్పుడు బయటికి వెళ్ళడానికి వీల్లేదు జ్వరంగా ఉంది" మిసెస్ రాణా గొంతు. బయటికి గట్టిగా అరచినా కొడుకు తనమాట వినడేమోనని లోపల భయంగానే ఉందామెకి.

"నేను వెళ్ళాలని ఎన్నిసార్లు చెప్పాలి? ఐ డోన్ట్ కేర్ ఫర్ వాట్ యూ సే" అంటూనే విసురుగా బయటికి దూసుకుపోయాడు "గోపాల్ గోపాల్ నామాట వినరా" అని అరుస్తూ తలుపు వంకే చూస్తూ కుర్చీలో నీరసంగా కూలబడిపోయింది మిసెస్ రాణా. తన పెంపకంలో ఏ లోపముందని గోపాల్ ఇలా తయారయ్యాడు. ఇది ఆవిడకి ఎంత ఆలోచించినా అర్థంకాని ప్రశ్న. ఒక్కగా నొక్క కొడుకు మరీ గారాబంచేస్తే దుర్వ్యసనాలకి బానిసై ఎక్కడ చెడిపోతాడోనని స్ట్రిక్ట్‌గా ఉన్నమాట నిజమే. కాని మరేం చేయడం? కాప్టన్ రాణా ఎప్పుడూ క్యాంప్ లోనే ఉంటాడు. ఎప్పుడైనా ఇంటికి వచ్చినప్పుడు ఇవన్నీ తాను చెప్పినా వినే తీరికా, ఓపికా అతనికి ఉండవు. పైగా కోపం వచ్చిందంటే మనిషినాపలేము. మరి తనేం చేయగలదు - అనుకుంటూ లోపల్లోపలే తానే బాధపడ సాగింది.

ఇంట్లోంచి బయట రోడ్డుమీదవద్ద గోపాల్ మనసు నిండా ఆలోచనలు. "పాపం అమ్మ పిలిచినా పలకకుండా తనొచ్చేశాడు. బాధపడిందేమో" అనుకుంటూండగా, తన మనసులోని భావాన్ని గ్రహించిన వాడిలా భుజంమీద చెయ్యేసి అనునయంగా అడిగాడు వివేక్ 'మళ్ళీ మీ అమ్మతో గొడవపడ్డావా' అని.

## ఓ గోపీ కథ

'మరేం చేయను? ఇంటి కెళ్తేనే చిరాకు. నేను చేసే ప్రతి పనీ వీళ్ళకి తప్పుగానే కనిపిస్తుంది. నేనింకా నోరెత్తకుండానే మా అమ్మ లెక్చర్ మొదలెడుతుంది. నాకు వినుగేస్తోంది'.

'పోనీ మీ నాన్నతో మాట్లాడితేనో? నేను ఏ విషయమైనా మా నాన్నతో చెప్పేస్తాను' అని గర్వంగా చెబుతున్న వివేక్‌ని చూసేటప్పటికి ఏడుపొచ్చినంత పనైంది గోపాల్‌కి.

"మా అమ్మకీ నాన్నకీ దెబ్బలాటలు ముగిస్తే కదా నావరకూ వచ్చేది. ఎంతసేపూ మా అమ్మ అరుపులూ, నాన్న రంకెలూ, ఛఛ చెప్పుకోడానికే సిగ్గుగాఉంది." గోపాల్ స్వతహాగా వివేక్ దగ్గరేమీ దాచడు. వాళ్ళది పదేళ్ళ స్నేహం మరి!

ఒక్కసారి తలవిదిల్చి గోపాల్ "సరే వివేక్. ఇంక ఈ కబుర్లు చాలు. ఈ రోజేంచేద్దాం? ఏదైనా థ్రిల్లింగా చేద్దాం" అంటున్న గోపాల్ కళ్లు ఉత్సాహంతో ఏదో తెలియని కసితో మెరుస్తున్నాయి.

'ఒద్దు బాబోయ్! పోయినసారి స్టోర్‌లో డబ్బు దొంగిలించినపుడు పోలీసుకి 300 రూపాయలు ఇచ్చి ఇంట్లో తెలియకుండా బయట పడేసరికి ప్రాణం పోయినంత పనైంది. ఈసారి 'లైట్' గా ఏమైనా చేద్దాం.'అంటూ వీధిచివరికి నడిచివెళ్ళారు. అప్పుడు టైమ్ రాత్రి 8 గంటలు కావస్తోంది.

"హే ఐ గాట్ యాన్ ఐడియా. రోడ్డు చివర్లో నిలబడి ఎవరైనా ఒంటరిగా కార్లోనో, స్కూటర్లోనో వస్తూంటే కత్తి చూపి బెదిరిద్దాం ఓకే?"

"ఫైన్"

* * * * *

ట్రింగ్ ట్రింగ్ మంటూ ఫోను విరామం లేకుండా మోగుతూనే ఉంది. అలసటగా కళ్ళు మూసుకొని ఉన్న మిసెస్ రాణా మళ్ళీ గొడవేమీ రాలేదు కదా అని భయపడుతూనే ఫోను తీసింది.

'హలో, మిసెస్ రాణా దిస్ ఈజ్ ఇన్స్‌పెక్టర్ సింగ్. ఇక్కడ నా ఎదురుగా ఇద్దరు కుర్రాళ్ళు ఉన్నారు. ఒకరి పేరేమో గోపాల్, కాప్టెన్ రాణా కొడుకునని అంటున్నాడు. అతనితో మాట్లాడతారా? - అని ఫోన్ గోపాల్ చేతికి అందించాడు.

గోపాల్ గొంతు విన్న మిసెస్ రాణా కంఠం పూడుకుపోయింది. 'మళ్ళీ ఏమైందిరా' అంది ఏడుపు గొంతుతో.

'ఏమీ లేదమ్మా' గోపాల్ గొంతులో విసుగు ధ్వనించింది. 'మేము చిన్న అడ్వెంచరు చెయ్య బోయాము. ఫెయిల్ అయింది. అంతే' అతని గొంతులో నిర్లక్ష్యం, ఒక విధమైన ఆనందం. 'అసలేమైందిరా' అని అడుగుతూండగానే ఇన్స్‌పెక్టర్ సింగ్ అందుకున్నాడు.

'సారీ మేడమ్, మీ అబ్బాయి, అతని స్నేహితుడు కలసి ఓ గంటక్రితం కారులో ఒంటరిగా వెళ్తున్న ఒక ముసలాయనని ఆపి డబ్బడిగారు. ఆయన భుజం మీద కత్తితో పొడిచారు కూడా. మీ అబ్బాయి పేరు ఇదివరకే ఒక స్టోర్ దొంగతనంతో మాకు తెలుసు. ఈసారి మేము కఠిన చర్య తీసుకోక తప్పదు.'

ఈ మాటలు వింటున్న మిసెస్ రాణా 'హరి దేవుడా'



అంటూ కుప్పకూలి పోయింది. ఎందుకు భగవంతుడు తననిలా పరీక్షిస్తున్నాడు? ఇప్పుడు తన కొడుకు జైల్‌లో ఉన్నాడని అందరికీ తెలిస్తే ఎంత అవమానం? రాణాకి తెలిస్తే ఎంత గొడవ?

అయితే అక్కడ పోలీస్ స్టేషన్‌లో గోపాల్ కూడా ఆలోచిస్తున్నాడు. తానెందుకిలా ప్రవర్తిస్తున్నాడు ఎవరి మీద తనకి ద్వేషం? తన వయసు పిల్లలందరూ బాగానే ఉంటారే. తనెందుకిలా తయారయ్యాడు? తన తల్లిదండ్రులపై కోపం ఇంకెవరిమీదో ఎందుకు చూపించడం?

ఇది 15 యేళ్ళకే అర్థం కాని ప్రశ్న.


* * * * *

అసలు ఇటువంటి సమస్యలెందుకొస్తున్నాయి? తల్లిదండ్రులు తమపిల్లలను అర్థం చేసుకొని, అతిగా అదుపులో పెట్టే అలవాటు మానుకొంటే ఇటువంటి గోపాల్‌లూ, వివేక్‌లూ ఉండరేమో.

చాలామంది తల్లిదండ్రులు మంచి పని చేస్తే మెచ్చుకొంటే పిల్లలు 'నెత్తికెక్కుతారేమో' నని భయపడి అతి స్ట్రిక్ట్‌గా ఉంటారు. పిల్లలేమో తల్లిదండ్రులు తమనిష్ట పడడం లేదనీ, తామేం చేసినా వాళ్ళకేమీ మెప్పులేదని భావిస్తారు.

మొదట్లో ఈ నిర్లక్ష్యం బాధగా ఉంటుంది. తరువాత అదే కసిగా మారి, తల్లిదండ్రులకు 'గుణపాఠం' చెప్పాలనే మనస్తత్వం ఏర్పడుతుంది. నిజమే వాళ్లు పెద్దల మనసునొప్పించే పనులు చేస్తారు. కానీ వారికి మనసులో ఎక్కడో తల్లిదండ్రులంటే ప్రేమ ఉండకపోదు. కాని తల్లిదండ్రుల మధ్య కీచులాటలు కూడా వీరికిటువంటి 'అకారణమైన తిరుగుబాటు' నేర్పరుస్తాయి. (రెబెల్ విథవుట్ కాజ్). వీరిని మార్చే బలం తల్లిదండ్రుల ప్రవర్తనలోనే ఉంది.

సుచిత్రామౌళి



### రచయిత్రి గురించి...

**'వనిత'** లో 'మనసుగతి ఇంతే' శీర్షిక క్రింద మనో విశ్లేషణ వ్యాసాలు రాసిన కుమారి వి. సుచిత్రామౌళి ప్రస్తుతం బెంగళూరులోని ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో మనస్తత్వశాస్త్రంలో రిసెర్చి స్కాలర్‌గా వున్నారు.